
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
శుక్రవారం 29 నవంబరు 2024



కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): 'అల్పపీడన ప్రభావంతో రెండురోజులపాటు జిల్లావ్యాప్తంగా వర్షాలు కురిసే అవకాశం ఉంది. అధికారులంతా అప్రమత్తంగా ఉండాల'ని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గురువారం ఒక ప్రకటనలో ఆదేశించారు. 'వర్షాల నేపథ్యంలో బాధితుల సహాయార్థం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ (08942-240557)ను ఏర్పాటు చేశాం. అలాగే డివిజన్, మండల కేంద్రాల్లో కంట్రోల్ రూమ్‌లు సిద్ధం చేశాం. రైతులు ధాన్యాన్ని జాగ్రత్త చేసుకోవాలి. ఏమైనా ఇబ్బందులుంటే కంట్రోల్ రూమ్ లేదా సమీపంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సంప్రదించాల'ని కలెక్టర్ సూచించారు.

పీఏగా చేరి.. రూ. కోట్లు గడించి..

ఆయన ఒకప్పుడు సీహెచ్‌సీలో ల్యాబ్ టెక్నీషియన్. వైసీపీ పాలనలో అప్పటి డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ వద్ద పీఏగా చేరాడు. అధికారం అండతో అడ్డదారులు తొక్కాడు. రూ.కోట్లు గడించాడు. అప్పట్లో ఆయనపై ఎన్నో అవినీతి ఆరోపణలు వచ్చాయి. కానీ, వాటన్నింటినీ మేనేజ్ చేశాడు. వైసీపీ అధికారం కోల్పోవడంతో.. మళ్లీ ల్యాబ్ టెక్నీషియన్‌గానే కొనసాగుతున్నాడు. కాగా.. పీఏగా ఉన్నప్పుడు ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టాడన్న అభియోగంతో ఆయనపై ఏసీబీ అధికారులు నిఘా పెట్టారు. గురువారం ఏకకాలంలో స్వగ్రామంతోపాటు అత్తవారిల్లు, పనిచేస్తున్న సీహెచ్‌సీ, బంధువుల ఇళ్లల్లో సోదాలు చేశారు. రూ.కోట్లలో అక్రమార్జన చేసినట్టు గుర్తించారు. గురువారం అర్ధరాత్రి వరకూ సోదాలు కొనసాగాయి.

- ధర్మాన కృష్ణదాస్ మాజీ పీఏ అవినీతి బాగోతం
- ఏకకాలంలో ఆరుచోట్ల ఏసీబీ ఆకస్మిక తనిఖీలు
- భారీగా అక్రమాస్తులు కూడబెట్టినట్లు గుర్తింపు
- బంగారు, వెండి ఆభరణాలు, ఆస్తిపత్రాలు స్వాధీనం



ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్న బంగారం, వెండి వస్తువులు, ఆస్తి పత్రాలు



మురళీ (ఫైల్)

శ్రీకాకుళం/ జలుమూరు/కోటబొమ్మాళి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి):

వైసీపీ నేత.. ధర్మాన కృష్ణదాస్ మాజీ పీఏ గొండు మురళీ అవినీతి బాగోతం బట్టబయలైంది. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారనే అభియోగాలపై ఇటీవల ఏసీబీ అధికారులకు ఫిర్యాదు అందింది. ఏసీబీ డైరెక్టర్ ఆఫ్ జనరల్ అతుల్‌సింగ్ ఆదేశాల మేరకు ఏసీబీ అధికారులు ఆకస్మిక దాడులు చేశారు. గురువారం జిల్లాతోపాటు విశాఖలోనూ ఏకకాలంలో ఆరు చోట్ల తనిఖీలు నిర్వహించారు. శ్రీకాకుళంలో ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి తన బృందంతో మురళీ నివాసంతోపాటు విధులు నిర్వహించిన చోట, బంధువుల ఇళ్లల్లో సోదాలు చేపట్టారు.

- మురళీ స్వగ్రామం.. జలుమూరు మండలం లింగన్నాయుడుపేటలోని ఇంట్లో ఏసీబీ సీఐ శ్రీనివాసరావు నేతృత్వంలో తనిఖీలు నిర్వహించారు. అలాగే మురళీ పనిచేస్తున్న సారవకోట మండలం బుడితి సీహెచ్‌సీలో కూడా సీఐ సుప్రియ నేతృత్వంలో సోదాలు నిర్వహించారు. మురళీ కారుతోపాటు ఆయన కంప్యూటర్‌ను పరిశీలించి కొంత సమాచారం సేకరించారు. వీఆర్వో రామారావు, పంచాయతీ కార్యదర్శి ధర్మరాజు నుంచి వివరాలు సేకరించారు. ఉదయం 5.30 నుంచి రాత్రి వరకూ సోదాలు చేసిన ఏసీబీ అధికారులు పలు పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. లింగన్నాయుడుపేట ఇంట్లో మురళీ తల్లి పద్మావతి, అక్క అరుణ, వదిన శ్యామల నివసిస్తున్నారు. ఏసీబీ సోదాలతో లింగన్నాయుడుపేటతోపాటు పరిసర గ్రామస్థులు ఉలిక్కిపడ్డారు.
- ప్రస్తుతం మురళీ.. అత్తవారి ఊరు కోటబొమ్మాళి మండలం దంత గ్రామంలోని కుటుంబంతో స్థిర నివాసం ఏర్పరచుకుని ఉంటున్నాడు. దంతలో కూడా ఆస్తులు బాగా కూడగట్టాడు. దీంతో ఏసీబీ ఎస్పీ రజనీ పర్యవేక్షణలో డీఎస్పీ రమణమూర్తి, సీఐ భాస్కరరావు ఆధ్వర్యంలో దంత గ్రామంలో కూడా రెండు చోట్ల సోదాలు చేశారు. అలాగే శ్రీకాకుళం నగరంలోనూ, విశాఖపట్నం జిల్లా గాజువాక, మధురవాడ ప్రాంతాల్లోని బంధువుల ఇళ్లల్లో కూడా తనిఖీ చేశారు.
- ధర్మాన కృష్ణదాస్ పీఏగా చేరక ముందు గొండు మురళీ.. సారవకోట మండలం బుడితి సీహెచ్‌సీలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేసేవాడు. కృష్ణదాస్ పీఏగా చేరిన తర్వాత ఆయన స్థాయి మారిపోయింది. 2019 నుంచి రెండున్నరేళ్ల వరకు ధర్మాన కృష్ణదాస్ ఉపముఖ్యమంత్రిగానూ, మంత్రిగానూ వ్యవహరించారు. ఆ సమయంలో పీఏగా మురళీ హవా అంతా ఇంతాకాదు. వైద్యఆరోగ్యశాఖ ఉద్యోగుల బదిలీల్లో ప్రత్యక్షంగానూ.. శ్రీకాకుళం జిల్లా అధికారులతో నేరుగా వ్యవహారాలను నడిపే విషయంలో కీలకంగానే వ్యవహరించారు. అప్పటి నుంచే మురళీపై అందరి దృష్టి పడింది. గతంలో ఈయనపై అవినీతి ఆరోపణలు వచ్చినా.. అధికార బలంతో వాటిని మేనేజ్ చేశాడు. తాజాగా ప్రభుత్వం మారడంతో ఏసీబీకి మురళీ బాగోతంపై ఫిర్యాదు అందింది. ఈ మేరకు ఏసీబీ అధికారులు (మిగతా 6వ పేజీలో..)



కోటబొమ్మాళి: దంత గ్రామంలో ఏసీబీ డీఎస్పీ ఆధ్వర్యంలో తనిఖీలు



శ్రీకాకుళంలో సోదాలు చేస్తున్న ఏసీబీ అధికారులు



జలుమూరు : లింగన్నాయుడుపేటలో మురళీ ఇల్లు



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

వసతిగృహాల్లో మరమ్మతులపై దృష్టి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్


శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): వసతిగృహాల్లో మరమ్మతులపై దృష్టి సారించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్, భోజన ఖర్చులు, వసతిగృహాల్లో సమస్యలపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా గిరిజన సంక్షేమ శాఖ ఏటీడబ్లుఓ శ్రీనివాసరావు, జిల్లా బీసీ సంక్షేమాధికారి అనూరాధ, సోషల్ వెల్ఫేర్ శాఖ ఏడీ విశ్వమోహన్‌రెడ్డి వసతిగృహాల్లో సమస్యలను వివరించారు. మందస ఆశ్రమ పాఠశాలలో సీట్లు ఖాళీగా ఉండడంపై కలెక్టర్ అడగ్గా.. వసతి భవనం చాలడం లేదని వార్డెన్ చెప్పారు. కొత్త భవనానికి ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ ఆదేశించారు. ఆశ్రమ పాఠశాలల్లో ఇతర కులాల విద్యార్థులు కూడా ఉండవచ్చని ఏటీడబ్ల్యూవో శ్రీనివాసరావు తెలిపారు. కమాటీ, కుక్, వాచ్‌మన్‌కు సంబంధించి 203 రెగ్యులర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. బీసీ సంక్షేమాధికారి అనూరాధ మాట్లాడుతూ.. వసతిగృహాల మరమ్మతులకు సంబంధించి ప్రతిపాదనలు పంపామని తెలిపారు. ఔట్‌సోర్సింగ్ పోస్టుల భర్తీకి అనుమతించాలని కోరారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ.. మరమ్మతుల కోసం త్వరలో నిధులు మంజూరు చేస్తామని వెల్లడించారు. అలాగే సగం నిర్మాణంలో ఉన్న భవనాల వివరాలపై కలెక్టర్ ఆరా తీశారు. పరీక్ష ఫీజులు చెల్లించ లేదనే కారణంతో హాల్‌టిక్కెట్లు జారీ చేయని పాఠశాలల యాజమాన్యాలపై కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో ఉపకార వేతనాలకు 50,948 మంది అర్హులు ఉన్నారని వివరించారు. సమావేశంలో సహాయ సంక్షేమాధికారులు, వార్డెన్లు పాల్గొన్నారు.

ఆశలు.. ఎదురుచూపులు



సిక్కోలు.. టీడీపీకి కంచుకోట. జిల్లాలో ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ మరింత బలపడింది. అన్ని నియోజకవర్గాల్లోనూ కూటమి అభ్యర్థులు గెలుపొందగా వైసీపీ తుడిచి పెట్టుకుపోయింది. కాగా.. గెలుపొందిన వారితోపాటు కూటమి నేతల విజయం కోసం శ్రమించినవారు.. వైసీపీ పాలనలో కేసుల బాధను భరించినవారు.. నామినేటెడ్, ఇతర పదవుల కోసం ఆశించారు. ఇటీవల ప్రభుత్వం కొన్ని నామినేటెడ్ పదవులు ప్రకటించగా.. తమకు ప్రాధాన్యం దక్కడం లేదని కొంతమంది అసంతృప్తితో ఉన్నారు. ప్రధానంగా ఇద్దరు కీలక నేతలతో పాటు శ్రీకాకుళం నగరానికి చెందిన మరికొందరు ఇప్పటికీ పదవులపై ఆశ వదులు కోలేదు. అధినేత కరుణిస్తారని, పార్టీ కోసం కష్టపడిన తమకు గుర్తింపునిచ్చే పదవులు కట్టబెడతారని ఆశగా ఎదురు చూస్తున్నారు.

- నామినేటెడ్ పోస్టులు దక్కలేదని.. ఇద్దరు టీడీపీ నేతల్లో కాస్త అసంతృప్తి
- కీలక పదవులు లభిస్తాయని ఇప్పటికీ నిరీక్షణ
- సామాజిక వర్గం వారీగా న్యాయం లభిస్తుందని నమ్మకం



ఎమ్మెల్యే కూన రవికుమార్



చౌదరి బాబ్జీ

శ్రీకాకుళం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి)

సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో కూటమి అభ్యర్థులు ఊహించని బంపర్ మెజార్టీతో విజయం సాధించారు. కొత్త ప్రభుత్వం ఏర్పడటంతో జిల్లాకు ఒక కేంద్రమంత్రి, ఒక రాష్ట్ర మంత్రి, ఇటీవల ప్రభుత్వ విప్ పదవులు లభించాయి. అయితే ఈ పదవులు తమకు దక్కలేదని ఒకరిద్దరు కీలక నాయకులు అసంతృప్తితో ఉన్నారు. ఇందులో ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ ఒకరు. ఈయన వైసీపీ హయాంలో ఆమదాలవలసలో అప్పటి స్పీకర్ తమ్మినేని సీతారాంతో ఎదుర్కొన్న కేసుల బెడద అంతా ఇంతాకాదు. గత ప్రభుత్వ నాయకుల ప్రోద్బలంతో ఆయనపై దాదాపు ఇరవై కేసుల వరకు నమోదయ్యాయి. వాటిని ఢీకొనడంతోపాటు తమ్మినేనిని తూర్పారబడుతూ నియోజకవర్గంలో టీడీపీని మరింత బలపరిచారు. తమ్మినేని వ్యవహారశైలితో నియోజకవర్గ ప్రజలు సైతం సార్వత్రిక ఎన్నికల్లో కూన రవివైపు మొగ్గు చూపి గెలిపించారు.

- 2014-2019 కాలంలో కూన రవికుమార్ ప్రభుత్వ విప్‌గా బాధ్యతలు చేపట్టారు. జిల్లాలో ప్రధాన సామాజిక వర్గానికి (కింతలి కళింగ) చెందిన ఈయన జిల్లా టీడీపీ అధ్యక్షుడిగానూ మొన్న ఎన్నికలకు కొద్దిరోజుల ముందు వరకు వ్యవహరించారు. ఎన్నికల్లో విజయం సాధిస్తే ఈ సారి మంత్రి పదవి లేదా.. తత్సమానమైన గుర్తింపు ఇచ్చేలా సీఎం చంద్రబాబు చర్యలు తీసుకుంటారని ఆయన భావించారు. పార్టీకి కష్టకాలంలో జిల్లా అధ్యక్షుడిగా వ్యవహరిస్తూ.. వైసీపీ వేధింపులను ఎదుర్కొనే రవికుమార్‌కు పదవుల్లో ప్రాధాన్యమిస్తారని ఆయన సామాజికవర్గ ప్రజలు, అనుచరులు కూడా ఊహించారు. కానీ మంత్రి పదవి దక్కకపోవడంతో కూన రవితోపాటు ఆయన వర్గం కాస్త అసంతృప్తితో ఉంది. కాగా.. వచ్చే మార్చినాటికి కూన రవికి కీలక పదవిలో అవకాశం లభించనున్నట్టు తెలుస్తోంది.

● తగిన గుర్తింపు లేదని..

జిల్లా కేంద్రానికి పక్కనే ఉన్నా.. ఎచ్చెర్ల నియోజకవర్గం విజయనగరం పార్లమెంట్ పరిధిలో ఉంది. ఈ నియోజకవర్గానికి ఎన్నికల ముందువరకు కీలకంగా వ్యవహరించిన మాజీమంత్రి కిమిడి కళావెంకటరావు.. మొన్న సార్వత్రిక పోరులో విజయనగరం జిల్లా చీపురుపల్లి నియోజకవర్గంలో పోటీచేసి గెలుపొందారు. ఎన్నికల తర్వాత ఈ నియోజకవర్గానికి టీడీపీ ఇన్‌చార్జి అంటూ ఎవరూ లేరు. ఈ నియోజకవర్గానికి చెందిన చౌదరి నారాయణమూర్తి(బాబ్జి).. 2014కు ముందు జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా పనిచేశారు. కాంగ్రెస్ హయాంలో.. పార్టీ కష్టకాలంలోనూ ఆయన కింజరాపు కుటుంబ అనుచరుడిగా ఉంటూ పార్టీ కోసం కష్టపడ్డారు. 2014లో టీడీపీ అధికారంలో రావడంతో జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ పదవిని ఆయన సతీమణి చౌదరి ధనలక్ష్మికి ఇచ్చారు. ఆ తర్వాత నుంచీ ఇప్పటివరకూ ఆయనకు పార్టీలో క్రియాశీలక పదవి లేదు. పలుమార్లు పార్టీ సమావేశాల్లో ఇదే విషయాన్ని చౌదరి నారాయణమూర్తి బహిరంగంగానే చెప్పేవారు.

- వైసీపీ ప్రభుత్వ హయాంలో చౌదరి నారాయణ మూర్తిని, ఆయన కుమారుడు అవినాష్‌ను కేసులతో ముప్పుతిప్పలు పెట్టారు. అయినా వెనక్కి తగ్గకుండా టీడీపీ ఆశయాలకు తగ్గట్టుగానే చౌదరి పనిచేశారు. కూటమి పొత్తుల నేపథ్యంలో ఊహించని విధంగా ఎచ్చెర్ల అసెంబ్లీ సీటును బీజేపీకి కేటాయించారు. బీజేపీ అభ్యర్థి ఎన్.ఈశ్వరరావు భారీ మెజార్టీతో గెలుపొందారు. ఎన్నికల తర్వాత ఈ నియోజకవర్గానికి ఇన్‌చార్జి లేక టీడీపీ కార్యక్రమాలు అంతగా నిర్వహించడం లేదు. ఇదిలా ఉండగా.. నామినేటెడ్ పదవుల భర్తీ (మిగతా 6వ పేజీలో..)

సమాచారం

జిల్లా సివిల్ సప్లయ్ డీఎంగా వేణుగోపాల్



శ్రీకాకుళం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లా సివిల్ సప్లయ్ మేనేజర్ (డీఎం)గా తామవాడ వేణుగోపాల్ నియమితులయ్యారు. ఈమేరకు కన్స్యూమర్స్ అఫైర్స్, ఫుడ్, సివిల్ సప్లయిస్ శాఖ గురువారం రాత్రి జీఓ విడుదల చేసింది. వేణుగోపాల్ మంగళగిరిలో సీసీఎల్‌ఏ విభాగానికి అదనపు సహాయ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అక్కడ నుంచి బదిలీపై శ్రీకాకుళం వస్తున్నారు. ఇదివరకు విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా, వీఎంఆర్‌డీఏ సెక్రటరీగా, విశాఖ జిల్లాలో తహసీల్దార్‌గా విధులు నిర్వహించారు. డిసెంబర్ 2న విధుల్లో చేరనున్నట్లు ఆయన తెలిపారు. ఇదిలా ఉండగా ప్రస్తుత శ్రీకాకుళం సివిల్ సప్లయ్ డీఎం శ్రీనివాసరావును ఎక్కడ నియమిస్తున్నారన్నదీ ఉత్తర్వులు వెలువడలేదు.

పరిశ్రమల వ్యర్థాలను శుద్ధి చేయాలి

- కాలుష్య నియంత్రణ మండలి అధికారుల ఆదేశం
- పైడిభీమవరంలో పరిశీలన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రణస్థలం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాలను శుద్ధి చేయాలని కాలుష్య నియంత్రణ మండలి అధికారులు.. సంబంధిత యాజమాన్యాలను ఆదేశించారు. పైడిభీమవరం పారిశ్రామిక వాడ నుంచి వెదజల్లుతున్న కాలుష్యం, కందివలస గెడ్డ నీరు కలుషితం కావడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. పైడిభీమవరం పంచాయతీలోని దేవునిపాలవలస, ముక్రుపాలవలస గ్రామస్థులు పరిశ్రమల కాలుష్యం బారిన పడి అనారోగ్యానికి గురవుతున్నారు. పరిశ్రమల్లోని వ్యర్థాలు కందివలస గెడ్డలో కలుస్తుండడంతో నీరు రంగు మారడంతో పాటు, ఈ నీటిని తాగే చేపలు, పక్షులు, జంతువులు మృత్యువాత పడుతున్నాయి. పరిశ్రమల ఏర్పాటు వల్ల ఉపాధి లేదు సరికదా కాలుష్యమేనన్న ఇక్కడి ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో కూడా ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు కూడా ఇదే విషయాన్ని ప్రస్తావించారు. పరిశ్రమల వ్యర్థాలతో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావిస్తూ.. 'ఉపాధి లేదు.. కాలుష్యమే' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ఈ నెల 23న ప్రచురితమైన కథనంపై సంబంధిత అధికారులు స్పందించారు. అదేరోజు పైడిభీమవరం పారిశ్రామిక వాడలోని కందివలస గెడ్డను కాలుష్య నియంత్రణ శాఖ అధికారులు పరిశీలించారు. గెడ్డలో నీటి శాంపిళ్లను సేకరించి ల్యాబ్‌కు తరలించారు. గెడ్డలో పరిశ్రమల వ్యర్థాలు విడిచిపెడితే నోటీసు లిస్తామని పేర్కొన్నారు. తాజాగా గురువారం ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్, విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ పి.కృష్ణయ్య, విశాఖపట్నం జోనల్ అధికారి కె.రమేష్, సీనియర్ ఇంజనీర్ జి. నాగిరెడ్డి, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల ప్రాంతీయ అధికారిణిలు బి.కరుణశ్రీ, బిబి సరిత పైడిభీమవరంలో పర్యటించారు. కందివలస గెడ్డ, పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం పరిశ్రమల యాజమాన్యాలతో నిర్వహించిన సమావేశంలో నూతన సాంకేతికను, గ్రీన్ టెక్నాలజీని, క్లీనర్ సాంకేతికను వినియోగించి పరిశ్రమల నుంచి విడుదలయ్యే వ్యర్థాలను శుద్ధి చేయాలని సూచించారు. కాలుష్య నియంత్రణ మండలి నిబంధనలు కచ్చితంగా పాటించాలని, కాలుష్యానికి కారణమైన పరిశ్రమలపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



కందివలస గెడ్డను పరిశీలిస్తున్న కాలుష్య నియంత్రణ మండలి అధికారులు



నేటి నుంచి పరిశ్రమలపై సర్వే

అరసవల్లి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలపై శుక్రవారం నుంచి సర్వే చేపట్టనున్నట్టు జిల్లా పరిశ్రమల శాఖ ఉప సంచాలకుడు జె.ఉమామహేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'గ్రామ, వార్డు, సచివాలయాల ఉద్యోగులు వచ్చే ఏడాది ఫిబ్రవరి 1 వరకూ ఈ సర్వే చేపట్టనున్నారు. ఇందుకోసం ఎంఎస్‌ఎంఈ సర్వే, సపోర్ట్ అనే ప్రత్యేక మొబైల్ యాప్ రూపొందించాం. ఈ సర్వే వల్ల పరిశ్రమల యజమానులు వివిధ రకాల ప్రోత్సాహకాలు పొందేందుకు అవకాశం లభిస్తుంద'ని ఆయన తెలిపారు.



పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

జ్యోతిరావు పూలేకు నివాళి

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పోరాడిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కొనియాడారు. జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా శ్రీకాకుళంలోని జ్యోతిరావు పూలే పార్కులో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే కలెక్టరేట్‌లోని జ్యోతిరావు చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. విద్య సామాజిక సంస్కరణ కోసం కృషి చేసిన జ్యోతిరావు పూలే ఆశయాలను కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో డీఆర్వో వేంకటేశ్వరరావు, కేఆర్సీ ఉపకలెక్టర్ పద్మావతి, బీసీ సంక్షేమశాఖ జిల్లాఅధికారి అనూరాధ, సాంఘిక సంక్షేమశాఖ ఉప సంచాలకులు విశ్వమోహన్‌రెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ ఏటీడబ్ల్యూవో శ్రీనివాసరావు, సహాయ సంక్షేమాధికారులు, వార్డెన్లు పాల్గొన్నారు.



ఈ ఊర్ల పేర్లే ప్రత్యేకం


- ఉద్దానం ప్రాంతంలో 'పుట్టుగ'ల సమాహారం
- చాలా గ్రామాల పేర్లు ఆ పదంతోనే ముగింపు

కొబ్బరి చెట్లు మధ్యన గొండ్యాలపుట్టుగ గ్రామం

బైరెడ్ల పుట్టుగ, జల్లు పుట్టుగ, గొనప పుట్టుగ, ఇంటెనక పుట్టుగ, శమళ్ల పుట్టుగ, తిప్పన పుట్టుగ..! సన్యాసి పుట్టుగ, రామయ్య పుట్టుగ, ఎర్రగోవింద పుట్టుగ, బాలాజీ పుట్టుగ..! ఇవన్నీ ఊర్ల పేర్లు. ఉద్దానం ప్రాంతంలో ఇలాంటివి అధికంగా కనిపిస్తాయి. ఇంటి పేర్లు, వ్యక్తుల పేర్లతో ఇక్కడి గ్రామాలు ముడిపడి ఉన్నాయి. చాలా ఊర్ల పేర్లు పుట్టుగ అనే పదంతో ముగుస్తాయి.


కంచిలి/కవిటి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి)

ఉద్దానం ప్రాంతంలో ఇంటి పేరుతోనే గ్రామాలు ఉన్నాయి. కొన్ని ఇంటిపేరు, మరికొన్ని వ్యక్తుల పేర్లతో గ్రామాలుండటం ఇక్కడి విశిష్టత. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో కవిటి, కంచిలి, ఇచ్ఛాపురం, సోంపేట మండలాల పరిధిలో పుట్టుగ పదంతో 140 వరకు గ్రామాలున్నాయి. ఇక్కడ నివాసం ఉన్న అధిక కుటుంబాల ఇంటి పేరుతోనే ఊర్ల పేర్లు ముడిపడి ఉన్నాయి.





పుట్టుగతో ఉన్న ఉద్దానం ప్రాంతంలోని గ్రామాలు..







పుట్టుగ, కణితిపుట్టుగ, తడకపుట్టుగ, యలమంచిలిపుట్టుగ, శవసానపుట్టుగ, దూగానపుట్టుగ, గుమ్మిడిపుట్టుగ, బింగిపుట్టుగ, లండారిపుట్టుగ, గుసిరిపుట్టుగ, ఎర్రగోవిందపుట్టుగ, డొంకపుట్టుగ, మజ్జిపుట్టుగ, కొన్నాయిపుట్టుగ, జన్నిపుట్టుగ, పత్రిపుట్టుగ, బొర్రపుట్టుగ, సాలినపుట్టుగ, సూరిపుట్టుగ.. ఇలా ఇంటిపేరుతోనే గ్రామాలున్నాయి. పుట్టుగకు ముందున్న పేరుతో ఉన్న కుటుంబాలు ఈ గ్రామాల్లో నివాసం ఉంటున్నాయి. కంచిలి మండలంలో కాళింగపుట్టుగ, కొక్కిలిపుట్టుగ, కొన్నాయిపుట్టుగ, కాకర్లపుట్టుగ, ప్రధానపుట్టుగ, సూదిపుట్టుగ, మజ్జిపుట్టుగ, పత్రిపుట్టుగ, శమళ్లపుట్టుగ, సాలినపుట్టుగ తదితర గ్రామాలున్నాయి.

ఒకే పేరుతో రెండు గ్రామాలు..

కవిటి మండలంలో ఒకే పేరుతో రెండు గ్రామాలున్నాయి. మండలానికి నైరుతిలో బి.గొనపపుట్టుగ, మరొకటి ఈశాన్య ప్రాంతంలోనున్న డి.గొనపపుట్టుగ గ్రామాలు ఇవి. ఈ రెండూ గ్రామ పంచాయతీ కేంద్రాలే. బి.గొనపపుట్టుగ పంచాయతీలో 11 గ్రామాలుండగా అన్నీ పుట్టుగతోనే పేర్లు ఉండటం.. ఆ పేరు కలిగిన కుటుంబాలు నివాసం ఉండటం గమనార్హం.

నాటి అటవీ ప్రాంతాలు.. నేడు పుట్టుగలు

ఉద్దానంగా పిలిచే ఈప్రాంతమంతా ఒకనాడు దట్టమైన చెట్లతో నిండి అడవిలా ఉండేదని చెబుతుంటారు. ఈ ప్రాంతంలోని అత్యధిక శాతం ఊర్ల పేర్లు పుట్టుగ అనే పదంతోనే ముగుస్తాయి. పుట్టుగ అంటే నివాస స్థలం అని ఇక్కడివారు చెబుతుంటారు. గతంలో కవిటి మండల కేంద్రానికి సమీపంలో కొబ్బరి తోటలు ఎక్కువగా ఉండేవి. ఇవి ఎక్కువగా జమిందార్ల ఆధీనంలో ఉండేవి. ఈ తోటల్లో పని చేసేందుకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి కూలీలు తమ కుటుంబాలతో వచ్చేవారు. అయితే భూ యజమాని ఉన్న స్థలం నుంచి ఈ తోటలు సుదూరంగా ఉండటం, రాత్రివేళల్లో సైతం కాపలా ఉండాల్సి రావడంతో.. ఈ కూలీలు అక్కడే తాత్కాలిక నివాసాలను ఏర్పాటు చేసుకున్నారు. క్రమేపి ఆ కుటుంబాల వారే ఆ ప్రాంతంలో ఉండటం, స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకోవడం జరిగింది. కాలక్రమంలో ఆ ప్రాంతం గ్రామంగా మారి, అక్కడ నివసిస్తున్న కుటుంబాల ఇంటి పేరుతోనే పిలవడం ప్రారంభించారు. ఇలా ఇక్కడి పుట్టుగలు ఏర్పడ్డాయని ఈ ప్రాంతవాసులు తెలిపారు.

ఇంటి పేరుతో గ్రామాలు..

ఇంటిపేరుతోనే ఇక్కడ గ్రామాలు ఉన్నాయి. బైరెడ్లపుట్టుగ, జల్లుపుట్టుగ, గొనపపుట్టుగ, ఇంటెనకపుట్టుగ, శమళ్లపుట్టుగ, తిప్పనపుట్టుగ, ప్రగడపుట్టుగ, లోళ్లపుట్టుగ, నర్తుపుట్టుగ, గొండ్యాల

వంశ వృక్షానికి ప్రతీక..

ఉద్దానంలోని ఊరి పేర్లు ఆ ప్రాంతంలో నివసిస్తున్న పెద్ద కుటుంబాల వంశ వృక్ష ప్రత్యేకతను తెలియజేస్తున్నాయి. తమ ఇంటి పేరుతో ఓ గ్రామం ఉందంటే, అది తమ వంశానికి గౌరవ ప్రదమైనదని నేటి తరం యువకులు సైతం చెబుతుంటారు. గతంలో పదుల సంఖ్యలో ఉన్న ఊర్లు నేడు పెరిగాయి. గతంలో గ్రామం అంటే 5 నుంచి 10 కుటుంబాలు నివసిస్తుండేవి. ప్రస్తుతం ఒక్కో గ్రామంలో వందలాది కుటుంబాలు ఉంటున్నాయి. ఈ ప్రాంతంలో ఏ ఊరి పేరు చెప్పినా, ఠక్కున పలానా వారు అక్కడ ఉంటారు అని చెప్పేంతగా ప్రాచుర్యం పొందాయి.

కులం పేరుతో గ్రామాలు..

ఉద్దానంలో కొన్ని గ్రామాలు కులం పేరుతోనే వెలిశాయి. ఆయా కుటుంబాల వారు ఒకచోట నివాసం ఏర్పరచుకోవడం వల్లే ఇలా పేర్లు ఉన్నట్లు చెబుతున్నారు. కంచిలి మండలంలో కాళింగపుట్టుగ, గొల్లపుట్టుగ, కవిటి మండలంలో చాకలిపుట్టుగ ఉన్నాయి. అలాగే వ్యక్తి పేరుతో సన్యాసిపుట్టుగ, రామయ్యపుట్టుగ, ఎర్రగోవిందపుట్టుగ, సహాలాలపుట్టుగ, బాలాజీపుట్టుగ వంటివి ఉన్నాయి. అంతేగాక గ్రామదేవత (అమ్మవారు) పేరుతో చండిపుట్టుగ, దుర్గమ్మపుట్టుగ, అమ్మవారిపుట్టుగ వంటి గ్రామాలు కూడా ఉన్నాయి.

వంశం పేరుతోనే వెలిశాయి..

కవిటి మండలంలోని ఉద్దానం ప్రాంతంలో తొలిసారి ఉన్న వంశీయుడి పేరుతోనే గ్రామం పేరు మొదలైంది. వారి ద్వారా అక్కడ కుటుంబాలు వెలిశాయి. దీంతో ఆ వంశీయుడి పేరును, పుట్టుగ కలిపి పిలవటం ఆనవాయితీగా మారింది. కానీ చారిత్రాత్మక అంశాల్లోగానీ పుట్టుగ అని ఎక్కడా లేదు.

-బి.ఉమామహేశ్వరరావు,
విశ్రాంత తెలుగు ఉపాధ్యాయుడు

ఆ డబ్బులు ఇక ఇవ్వనట్టేనా?

- స్లీపింగ్ మీటర్ డీడీ చార్జీలు వెనక్కి ఇవ్వని ఈపీడీసీఎల్
- జిల్లాలో 1,503 మీటర్లకు రూ.3.70 లక్షల చెల్లింపు బకాయి



టెక్కలి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఈపీడీసీఎల్ యంత్రాంగం తీరు కొందరు వినియోగదారులకు అసంతృప్తి కలిగిస్తోంది. వారికి తిరిగి చెల్లించాల్సిన డబ్బుల వ్యవహారంపై ఏళ్లుగా తాత్సారం చేస్తోంది. మీటర్ సాంకేతిక మరమ్మతుకు గురై బిల్లు అధికంగా వస్తుందని సదరు వినియోగదారుడు విద్యుత్‌శాఖ యంత్రాంగానికి ఫిర్యాదు చేస్తే.. ఆ ఫెయిల్యూర్ స్లీపింగ్ మీటర్‌ను తొలగించి శ్రీకాకుళంలోని మీటర్ రీడింగ్ టెస్టింగ్‌కు పంపిస్తుంటారు. అయితే దాన్ని పంపే ముందు వినియోగదారుడు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ట్రాన్స్‌ఫార్మర్స్ పేరిట రూ.200, 18శాతం జీఎస్టీ రూ.36 కలుపుకుని రూ.236 డీడీ తీసి ఆశాఖ అధికారులకు అందించాలి. నిజంగా సంబంధిత మీటర్ ఫెయిల్ అయితే వినియోగదారుడు కట్టిన డీడీని తిరిగి చెల్లించాలి. ఇక్కడ ఆ పరిస్థితి ఉండడం లేదు. ఇటీవల టెక్కలికి చెందిన ఓ వినియోగదారుడు తన విద్యుత్‌మీటర్ ఫెయిల్ అవడంతో రూ.236 డీడీ చెల్లించారు. మీటర్‌రీడింగ్ టెస్టింగ్‌కు శ్రీకాకుళం పంపించగా అది ఫెయిల్యూర్ స్లీపింగ్ మీటర్‌గా గుర్తించారు. అయితే జిల్లాలో ఫెయిల్యూర్ స్లీపింగ్ మీటర్ల పరిస్థితి ఏమిటని, తిరిగి వినియోగదారులకు డీడీలు చెల్లిస్తున్నారా? అని సంబంధిత యంత్రాంగానికి ఆర్టీఏ కింద కోరడంతో వారు సమాచారం అందించారు. ఇందులో 2023-24 ఆర్థిక సంవత్సరానికి స్లీపింగ్‌మీటర్స్ 1,973 వరకు రాగా.. వాటిలో 1,246 ఫెయిల్ అయినట్లు అంగీకరించారు. అలాగే 2024-25 ఆర్థిక సంవత్సరానికి 442 స్లీపింగ్‌మీటర్స్‌కు గాను 257 మీటర్లు ఫెయిల్ అయినట్లు గుర్తించారు. మొత్తం 1,503 ఫెయిల్యూర్ స్లీపింగ్ మీటర్లకు గాను రూ.3,54,708 వినియోగదారులకు చెల్లించాల్సి ఉందని తెలుస్తోంది. ఈపీడీసీఎల్ యంత్రాంగం వ్యవహారంపై సదరు వినియోగదారుడు కన్స్యూమర్ గ్రీవెన్స్ రెడ్‌సెల్ ఫోరమ్‌ను ఆశ్రయించాడు. ఈనెల 23న వాదనలు విన్న ఫోరం తీర్పునిచ్చింది. వినియోగదారులకు మొదటగా అవగాహన కల్పించాలని, అవసరమైతే ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రికల్ రెగ్యులేటర్ కమిషన్ సంస్థను ఆశ్రయించాలని సూచించింది. దీంతో సదరు వినియోగదారుడు ఏపీఈఆర్సీని ఆశ్రయించేందుకు సిద్ధమయ్యారు.


అది పెద్ద పులే!

- అర్ధరాత్రి దాడి చేసి ఆవును చంపేసిన వైనం
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటున్న అధికారులు

సంతబొమ్మాళి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పెద్దకేశవనాయుడుపేట గ్రామంలో పెద్దపులి కదలికలు కలకలం రేపుతున్నాయి. గుర్తు తెలియని జంతువు దాడిలో ఓ ఆవు మృతి చెందడంతో భయపడుతున్నారు. మండలంలోని హెచ్ఎన్‌పేట పంచాయతీ పెద్దకేశవనాయుడుపేట గ్రామంలో భద్రచాలం శాంతమూర్తికి చెందిన ఆవు గుర్తు తెలియని జంతువు దాడిలో బుధవారం అర్ధరాత్రి మృతి చెందింది. ఆవు మెడపై గాయాలు ఉండడంతో పాటు ఘటన స్థలంలో జంతువు పాదముద్రలు గుర్తించి గ్రామస్థులు నౌపడ పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు, అటవీ శాఖాధికారులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. జంతువు పాద ముద్రల ఆనవాళ్లను గుర్తించి అవి 14 ఇంచుల పొడవుతో ఉన్నట్లు చెబుతున్నారు. దీన్ని బట్టి అది మగ పెద్దపులి అయి ఉంటుందని వారు చెబుతున్నారు. ఇటీవల ఇచ్ఛాపురం ప్రాంతంలో పెద్దపులి తిరుగుతోందన్న ప్రచారం జరగడంతో ఈ అనుమానాలకు మరింత బలం చేకూరింది. పెద్ద పులి రోజుకు 45 కిలోమీటర్లు ప్రయాణిస్తుందని అటవీశాఖాధికారులు చెబుతున్నారు. వారు తహసీల్దార్ రమేష్‌కుమార్‌కు సమాచారం అందించారు. పరిసర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ దండోరా వేయించాలని కోరారు. ఫారెస్టు రేంజర్ జి.జగదీశ్వర్, ఏసీఎఫ్ ఏవీ నాగేంద్ర, ఎస్‌ఐ నారాయణస్వామి తదితరులు ఘటనా స్థలానికి వచ్చారు.



ఘటన స్థలంలో పులి పాదముద్రలు



పులి దాడిలో మృతి చెందిన ఆవు

పులి సంచారంపై మంత్రి ఆరా..

మండలంలో పెద్దపులి సంచారంపై మంత్రి అచ్చెన్నాయుడు ఆరా తీశారు. అటవీశాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. పెద్దపులి దాడిలోనే ఆవు మృతి చెందిందని ఆ శాఖ అధికారులు ఆయనకు తెలియజేశారు. వేలిముద్రల ఆధారంగా పెద్దపులిగా గుర్తించామని, ఒడిశా నుంచి టెక్కలి వైపు వచ్చి ఉంటుందని అధికారులు చెప్పారు. పెద్దపులి సంచారంపై గ్రామాల్లో దండోరా వేయించి ప్రజలను అప్రమత్తం చేయాలని అటవీ, రెవెన్యూ శాఖల అధికారులను అచ్చెన్నాయుడు ఆదేశించారు.

ఆశలు.. ఎదురుచూపులు

(ఐదో పేజీ తరువాయి)

విషయంలో డీసీసీబీ ఛైర్మన్ లేదా.. ఇతరత్రా కీలక పదవులు తనకు ఇస్తారని చౌదరి బాబ్జీ, ఆయన అనుచరులు భావించారు. కానీ కళింగ కార్పొరేషన్‌కు డైరెక్టర్‌గా ఇచ్చారు. కాగా తన సేవలకు అది చిన్న పదవి అంటూ.. దానిని సున్నితంగా చౌదరి బాబ్జీ తిరస్కరించినట్టు విశ్వసనీయ సమాచారం. ఇంకా అతిత్వరలో ప్రభుత్వం భర్తీచేయాల్సిన పదవుల్లో మరికొన్ని కీలకమైనవి ఉన్నాయి. అప్పుడైనా సామాజికవర్గం పరంగా(కింతలి కళింగ)కు న్యాయం చేకూర్చేలా ఆశించిన స్థాయి పదవి ఇస్తారని ఆశగా ఉన్నారు. పార్టీ కష్టకాలంలో సేవలందించిన వారి విషయంలో సమగ్ర నివేదిక సీనియర్ నేత, మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ముందు ఉంచినట్లు తెలిసింది. రాబోయే పదవుల్లో చౌదరికి నామినేటెడ్ పదవి విషయంలో ప్రస్తుతం ఇచ్చిన కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ నుంచి తప్పించి.. మరో పదవి కట్టబెడతారని విశ్వసనీయ సమాచారం. డీసీసీబీ ఛైర్మన్ లేదా జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్... లేదా రాష్ట్రస్థాయిలో మరే పదవి అయినా ఈయనకు ఇస్తున్నారని భోగట్టా.

● ఆశించి.. డీలా పడి..

శ్రీకాకుళం నియోజకవర్గంలో కనీవినీ ఎరుగని విధంగా టీడీపీ అభ్యర్థి గొండు శంకర్‌కు 55వేల ఓట్లకుపైగా మెజార్టీ లభించింది. ఆ స్థాయిలో టీడీపీ నాయకులు కలసికట్టుగా పనిచేయడం.. ప్రజలు కూడా వైసీపీని ఛీదరించుకోవడంతో రాష్ట్రస్థాయిలో టీడీపీ అభ్యర్థి చర్చించుకున్న పరిస్థితి ఏర్పడింది. అయితే నామినేటెడ్ పదవులను అత్యధికమంది ఈ నియోజకవర్గం నుంచి ఆశించారు. ఇందులో 'శ్రీకాకుళం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్' ఒకటి. ఈ పదవిని పాతపట్నం నియోజకవర్గానికి చెందిన జనసేనకు చెందిన వ్యక్తికి ప్రభుత్వం ఇచ్చింది. దీంతో టీడీపీ ద్వితీయస్థాయి నాయకుల ఆశలు అడియాశలయ్యాయి. చెప్పుకోదగిన ఇతరత్రా పదవులు లభించకపోవడంతో టీడీపీ సీనియర్ నాయకులు మాదారపు వెంకటేష్, పీఎంజే బాబు, విభూది సూరిబాబు, రమణ మాదిగ వంటివారు కాస్త నిరాశ చెందుతున్నారు. ఇంకా ఇవ్వబోయే నామినేటెడ్ పదవుల విషయంలోనైనా ప్రాధాన్యం ఇవ్వాలని.. పార్టీ అధిష్ఠానానికి.. కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడుకి మరోసారి దరఖాస్తులు ఇచ్చినట్లు సమాచారం. దీనిపై సీఎం చంద్రబాబు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారోనని తెలుగు తమ్ముళ్లు ఆశగా ఎదురుచూస్తున్నారు.

రిమ్స్‌లో అంబులెన్స్‌కు చోటేదీ?

- ప్రైవేటు వాహనాలతో అడ్డగోలు పార్కింగ్
- చోద్యం చూస్తున్న అధికారులు



రిమ్స్ ఆసుపత్రి వద్ద వాహనాల పార్కింగ్ దృశ్యం

అరసవల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్-రిమ్స్)కి రోజూ వేలాది మంది రోగులు వస్తుంటారు. జిల్లా నలుమూలల నుంచి ప్రాణాపాయస్థితిలో ఉన్న కేసులు, మెరుగైన వైద్యసేవలు అవసరమైన రోగులను నిత్యం ప్రభుత్వ ప్రైవేటు అంబులెన్స్‌ల ద్వారా ఈ ఆస్పత్రికి తీసుకు వస్తుంటారు. ఇటువంటి సీరియస్ కండిషన్‌లో ఉన్నవారికి ప్రతీ నిమిషం చాలా విలువైనదే. రోగి ప్రాణాలు నిలబడాలంటే సకాలంలో ఆస్పత్రికి తీసుకువచ్చి.. వైద్యసేవలు అందజేయాలి. కానీ రిమ్స్ ఆస్పత్రి ఆవరణలో ఇటువంటి అత్యవసర, ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు తీసుకువచ్చే అంబులెన్స్‌లు పార్కింగ్ చేయడానికే చోటు లేని పరిస్థితి నెలకొంది. ఆస్పత్రి ఎదుట ఆటోలు, ద్విచక్ర వాహనాలు అడ్డగోలుగా పార్కింగ్ చేస్తున్నారు. దీంతో అంబులెన్స్‌లు ఆస్పత్రి వద్దకు నేరుగా చేరుకోవడానికి అవకాశం లేని పరిస్థితి నెలకొంది. ఇలా అయితే ఆస్పత్రిలోకి రోగి ఎలా తీసుకెళ్లగలమని సంబంధిత బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైద్యులు, ఆస్పత్రి అధికారులు, సెక్యూరిటీ సిబ్బంది నిత్యం ఈ పరిస్థితిని చూస్తున్నా సరే.. పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ప్రాణాపాయస్థితిలో ఉన్న రోగులను సకాలంలో ఆస్పత్రి లోపలకి తీసుకువెళ్లే అవకాశం లేకపోతే.. చికిత్స అందేలోగా ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రిమ్స్ ఆసుపత్రి వద్ద ట్రాఫిక్/పార్కింగ్ సమస్యను పరిష్కరించి రోగుల ప్రాణాలు కాపాడాలని పలువురు కోరుతున్నారు.

పీఏగా చేరి.. రూ.కోట్లు గడించి..

(ఐదో పేజీ తరువాయి)

దాడులు చేయగా.. ఆయన కూడబెట్టుకున్న అక్రమాస్తులు బయటపడ్డాయి. ఇందులో అన్నీ స్థిరాస్తులే అధికం. కాగా.. వైసీపీ పాలనలో హవా నడిపి.. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ బుడితి సీహెచ్‌సీలో ఉద్యోగం చేస్తుండడం గమనార్హం.



బుడితి సీహెచ్‌సీలో ఏసీబీ అధికారుల సోదాలు

అక్రమాస్తులు ఇవీ..

శ్రీకాకుళంలో ఓ ఇల్లు, కోటబొమ్మాళి మండలం దంత గ్రామంలో మూడు ఇళ్లు, మధురవాడలో ఫ్లాట్, గాజువాకలో ఇల్లు, కోటబొమ్మాళిలో ఓ ఇల్లు, శ్రీకాకుళం జిల్లాలో నాలుగు హౌస్ ప్లాట్స్ విశాఖ జిల్లా పెందుర్తిలో ఒక ఇంటి ప్లాట్, విజయనగరం జిల్లా భోగాపురంలో ఇంటి ప్లాట్ ఉన్నట్టు గుర్తించారు. శ్రీకాకుళం జిల్లాలో 15ఎకరాల 47 సెంట్ల వ్యవసాయ భూమి, 6ఎకరాల 5 సెంట్ల మెట్ట భూమి, ఇంటిలో 520 గ్రాముల బంగారు ఆభరణాలు, బ్యాంకు లాకర్‌లో 536 గ్రాముల బంగారు ఆభరణాలు, ఇంటిలో 11 కిలోల 36 గ్రాముల వెండి వస్తువులు, బ్యాంకు ఖాతాలో రూ. 43,223, ఒక మారుతీ కారు (ఇగ్నిస్), ఒక బుల్లెట్ మోటార్ సైకిల్.. ఉన్నట్లు ఏసీబీ తనిఖీలో వెల్లడైంది. ఈ ఆస్తులన్నీ అతని పేరుతోనూ, అతని బంధువుల పేరుతోనూ కూడబెట్టుకున్నట్లుగా ఏసీబీ అధికారులు నిర్ధారించారు. అలాగే డిఫెన్స్‌కు చెందిన 5 లిక్కర్ బాటిళ్లు, ఒడిశా రాష్ట్రానికి చెందిన మరో ఐదు లిక్కరు బాటిళ్లు తనిఖీలో లభించాయి. దీంతో కోటబొమ్మాళి ఎక్సైజ్ స్టేషన్‌లో కేసు నమోదైంది. అక్రమాస్తులను కూడబెట్టుకున్న వైద్యఆరోగ్యశాఖ ఉద్యోగి మురళీని అదుపులోకి తీసుకుని విశాఖలోని ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని డీఎస్పీ రమణమూర్తి తెలిపారు. ఇదిలా ఉండగా... మురళీ అక్రమాస్తుల చిట్టా బట్టబయలుకావడంతో వైద్యఆరోగ్యశాఖలోనూ.. గతంలో బాధితులుగా ఉన్న ఇతర ప్రభుత్వ ఉద్యోగులు సంబర పడుతున్నారు.

పీర్లకొండకు పోటెత్తిన భక్తజనం



పీర్లకొండపై భక్తులు

ఇచ్ఛాపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పీర్లకొండకు గురువారం భక్తులు పోటెత్తారు. కొండపైకి చేరుకుని పీర్లస్వామికి అటుగుళ్ల బెల్లంను నైవేద్యంగా సమర్పించారు. ఏటా మార్గశిర మాసంలో వచ్చే నాలుగు గురువారాలు పీర్లకొండ యాత్ర నిర్వహిస్తారు. మతాలకు అతీతంగా జరిగే ఈ పండుగలు ఆదర్శంగా నిలుస్తుంది. ఒకరి మత విశ్వాసాలను మరొకరు గౌరవిస్తారు. సమష్టిగా పండగను జరుపుకున్నారు. అదే పీర్లకొండ యాత్ర, ఇక్కడ హిందువులు విశ్వసించేలా కొలువుతీరి ఉన్నట్లు ఏ దేవుడు ఉండరు. వివిధ కళాశాలలు, పాఠశాలలకు చెందిన విద్యార్థులు కొండపై సందడి చేశారు. కందకం నీళ్లను భక్తులు తీర్థంగా స్వీకరించారు. ముస్లిం మత పెద్దలు ప్రత్యేక పూజలు జరిపి ప్రసాదాలు అందించారు.



కొండకం నీటిని తీర్థంగా స్వీకరిస్తున్న భక్తులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎచ్చెర్ల, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ ఎచ్చెర్ల మండల హెడ్‌క్వార్టర్స్ ఫీడర్, ఎచ్చెర్ల, అనమిత్ర టౌన్‌షిప్, ఎస్ఎం పురం పాఠశాలకు శుక్రవారం విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఈఈ పి.యోగీశ్వర రావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ నిరంతర సరఫరాలో భాగంగా తీగలకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించేందుకు విద్యుత్ సరఫరాను ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటలకు నిలిపివేస్తున్నట్టు చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

● ఇచ్ఛాపురం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలో గల పలు వార్డుల్లో విద్యుత్ మరమ్మతులు చేపట్టనుండడంతో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు గొల్లవీధి, కోర్ట్ స్ట్రీట్, పకీర్‌పేట, వీకే పేట, రత్తకన్న, చక్రపాణి వీధి, మండపల్లి ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ విఘ్నేశ్వర రావు ప్రకటనలో తెలిపారు.

● గార, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): తూలుగు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిజామాబాద్, కె.నైరిగాం, తూలుగు గ్రామాలకు సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ పి.యోగీశ్వరరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించాలన్నారు.

ఎక్సైజ్ స్టేషన్‌లో డీసీ తనిఖీ

ఆమదాలవలస, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ పోలీస్‌స్టేషన్‌లో డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైమ్ డిటెక్షన్, బైండోవర్ కేసులు వివరాలతోపాటు ఇటీవల నూతనంగా ఏర్పడిన మద్యం దుకాణాల చెల్లింపులను పరిశీలించారు. బెల్ట్‌షాపులు నిర్వహించే పాత నేరస్థులను ఆయా తహసీల్దార్ల వద్ద బైండోవర్ చేయించాలన్నారు. సీఐ సతీష్‌కుమార్, ఎస్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధిపై కేంద్ర మంత్రికి వినతి

రణస్థలం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారుల శాఖ మంత్రి మంత్రి నితిన్ గడ్కారీని న్యూఢిల్లీలోని వారి కార్యాలయంలో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు గురువారం కలిసి పలు రోడ్ల అభివృద్ధికి వినతిపత్రాన్ని అందజేశారు. నెల్లిమర్ల జంక్షన్ నుంచి రామతీర్థం మీదుగా రణస్థలం వరకు రహదారి పునర్నిర్మాణం చేపట్టాలని మంత్రిని ఎంపీ కోరారు. విజయనగరం నుంచి కొట్టూరు వరకు ఎన్‌హెచ్-16ను నాలుగు లైన్ల రహదారిగా అభివృద్ధి చేయాలని మంత్రికి వినతిపత్రాన్ని ఇచ్చారు. రామభద్రపురం నుంచి రాయఘడ వరకు నాలుగు లైన్ల రోడ్డు అభివృద్ధి చేయాలని మంత్రిని ఎంపీ కోరారు.

విష జ్వరాలపై కదిలిన వైద్య సిబ్బంది



పరీక్షిస్తున్న వైద్యులు శేషగిరి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఎచ్చెర్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పొన్నాడ పీహెచ్‌సీ పరిధిలోని కొంగరాం గ్రామంలో పలువురు విష జ్వరాలతో బాధపడుతున్నట్టు గురువారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి వైద్య సిబ్బంది స్పందించారు. దీంతో గురువారం ప్రత్యేకంగా వైద్య శిబిరాన్ని నిర్వహించి 54 మందిని పరీక్షించారు. పీహెచ్‌సీ వైదులు ఎన్.శేషగిరి, జిల్లా మలేరియా అధికారి సత్యనారాయణ తదితరులు గ్రామాన్ని సందర్శించారు.

విజయవంతం చేయండి

లావేరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా శ్రీకాకుళంలో ఈ నెల 29వ తేది శుక్రవారం నిర్వహించనున్న గర్జనలో మాలలు అందరు పాల్గొని విజయవంతం చేయాలని ఆ సంఘ దళిత సంఘ నాయకులు అప్పారావు కోరారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు ఏడు రోడ్ల జంక్షన్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ ఉంటుందన్నారు.

ధాన్యం కొనుగోలుపై నిర్లక్ష్యం చేయొద్దు

● జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్‌ఖాన్



సింధువాడలో రైతులతో మాట్లాడుతున్న జేసీ

సరుబుజ్జిలి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసే విధానంలో అధికారులు నిర్లక్ష్యం వహించరాదని జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్‌ఖాన్ అధికారులను ఆదేశించారు. గురువారం చిగురువలస, షలంత్రి, సింధువాడ, పెద్దసవలాపురం గ్రామ సచివాలయ పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలతో పాటు సరుబుజ్జిలి రామాంజనేయ రైస్‌మిల్లులో తనిఖీలు చేశారు. ధాన్యం కొనుగోలు ఏ విధంగా జరుగుతున్నాయి, వాటి వివరాలు మండల వ్యవసాయాధికారి బి.పద్మనాభాన్ని జేసీ ప్రశ్నించగా.. రైస్‌మిల్లు నుంచి బ్యాంకు గ్యారెంటీలు ఇంకా పూర్తి కాలేదన్నారు. దీనిపై జేసీ స్పందిస్తూ.. రైస్‌మిల్లర్లు యజమానులు ఆయా బ్యాంకుల అధికారులతో ఫోన్లు ద్వారా మాట్లాడి తక్షణమే బ్యాంకు గ్యారెంటీలు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ జేడీ బి.రాజగోపాలరావు, తహసీల్దార్ ఎల్.మధుసూదన్ తదితరులు ఉన్నారు.

వేగవంతం చేయాలి: ఆర్డీవో

జిసిగడాం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని శ్రీకాకుళం ఆర్డీవో సాయి ప్రత్యూష అన్నారు. గురువారం సంతవురిటిలోని ఓ రైస్ మిల్లును ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు, ధాన్యం కొనుగోలులో మిల్లర్లు అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు తెచ్చిన ధాన్యానికి కొర్రీలు వేయకుండా నిబంధనలు ప్రకారం కొనుగోలు చేయాలన్నారు. కస్టోడియన్ అధికారిగా వీఆర్వో బాధ్యతగా వ్యవహరించాలన్నారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ.. పెంగల్ తుఫాన్ హెచ్చరిక నేపథ్యంలో కోసిన వరి పంటను కుప్పలుగా వేసుకోవాలన్నారు. నూర్పుచేసిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. తహసీల్దార్ ఎం.శ్రీకాంత్, ఏవో ఎర్రా శారద, ఆర్ఐ ఎ.రాధ, వీఆర్వో శ్రీనివాసరావు, వీపీఏలు అలుగోలు లక్ష్మీనారాయణ, ముంతా హరిష్, సింహాద్రి హరికృష్ణ, సర్వేయర్ పావని తదితరులు ఉన్నారు. అలాగే పెంట గ్రామంలో శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించనున్నట్టు ఏవో తెలిపారు.



మిల్లర్లతో మాట్లాడుతున్న ఆర్డీవో ప్రత్యూష

చేపల వేటకు వెళ్లొద్దు

గార, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో మత్స్యకారులు సముద్రంలో చేపట వేటకు వెళ్లొద్దని మండల అధికారులు సూచించారు. ఇప్పటికే నాలుగు రోజుల నుంచి చేపల వేటకు వెళ్లని మత్స్యకారులకు వచ్చే నెల 1వ తేదీ వరకు వేటకు వెళ్లొద్దన్నారు. కాగా ఇప్పటికే నాలుగు రోజుల నుంచి చేపల వేటకు వెళ్లని తాము జీవనోపాధి కోల్పోయామని, కుటుంబ పోషణ కష్టంగా ఉందని పలువురు మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారులు స్పందించి తమను ఆర్థికంగా ఆదుకోవాలని వారంతా వేడుకుంటున్నారు.

పరిశ్రమలతోనే సమాజాభివృద్ధి

● ఘనంగా ఎన్ఎఫ్‌సీఎల్ వ్యవస్థాపక దినోత్సవం



మాట్లాడుతున్న పరిశ్రమ ఉపాధ్యక్షుడు శేషగిరిరావు

ఎచ్చెర్ల, నవంబరు 28: పరిశ్రమల ఏర్పాటుతో సమాజాభివృద్ధి సాధ్యమని ఎన్ఎఫ్‌సీఎల్ ఉపాధ్యక్షుడు కె.శేషగిరి రావు అన్నారు. ఎన్ఎఫ్‌సీఎల్ (అరిణాం అక్కివలస)లో పరిశ్రమ వ్యవస్థాపకులు దివంగత కేవీకే రాజు జయంతి సందర్భంగా గురువారం వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిశ్రమ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. సమాజ శ్రేయస్సే ధ్యేయంగా పనిచేసిన కేవీకే రాజు ఆశయ సాధనకు అనుగుణంగా సిబ్బంది ముందుకుసాగాలన్నారు. పర్యావరణ పరిరక్షణ, ఉద్పాతక రంగంలో ముందంజకు సంఘటితంగా పని చేయాలన్నారు. హెచ్‌పీడీ హెడ్ కె.శ్యామ్‌ప్రసాద్, ఎన్విరాన్‌మెంటు హెడ్ చిన్నదురై తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అలాగే పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీలో ఉత్తమ ఫలితాలు సాధించిన పరిశ్రమలో పనిచేస్తున్న ఉద్యోగుల పిల్లలకు ప్రోత్సాహకాలు అందజేశారు. పరిశ్రమలో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న సిబ్బందిని సత్కరించారు. తొలుత దివంగత కేవీకే రాజు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిబ్బంది నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

అసిరి పోలమ్మకి ఎమ్మెల్యే పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

కవిటి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): తుంగానపుట్టుగ గ్రామంలో అసిరి పోలమ్మ అమ్మవారిని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్ గురువారం దర్శించు కుని ప్రత్యేకంగా పూజలు చేశారు. విప్‌గా బాధ్యతలు చేపట్టి తొలిసారిగా గ్రామానికి వచ్చిన ఆయన అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కొత్త బస్సులు ప్రారంభం

అరసవల్లి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): శ్రీకా కుళం బస్ స్టేషన్ ఆవరణలో రెండు కొత్త ఎక్స్ ప్రెస్ బస్సులను ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు (ఎన్ఈఆర్) గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీని బలోపేతం చేసి ప్రజలకు మరింత మెరుగైన సేవలందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోంద న్నారు. శ్రీకాకుళం-2 డిపో మేనేజర్ కేఆర్ఎస్ శర్మ, యూనియన్ ప్రతినిధులు, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులకు వైద్య పరీక్షలు

కంచిలి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న భవిత కేంద్రాన్ని గురువారం సోంపేటకు చెందిన సీనియర్ సివిల్ న్యాయాధికారి జె.శ్రీనివాస రావు, జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎ.రాము సందర్శించారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగ చిన్నారులకు కళ్లు, ముక్కు, చెవికి సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించారు.

వినూత్న నైపుణ్యాలతో ఉజ్వల భవిత

ఎచ్చెర్ల, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వినూత్న నైపుణ్యాలను ప్రదర్శిస్తేనే ఉజ్వల భవిత పొందవచ్చని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీ కేఆర్ రజని అన్నారు. ఎస్‌జీబీఎస్ ఉన్నతి (బెంగళూరు), ఏపీఎస్ఎస్‌డీసీతో కలిసి వర్సిటీ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో ఎంబీఏ, ఎంసీఏ, ఇంజనీరింగ్ కంప్యూటర్ సైన్స్ కోర్సు విద్యార్థులకు నెల రోజుల పాటు నిర్వహించిన నైపుణ్య శిక్షణ తరగతుల ముగింపు సమావేశం గురువారం జరిగింది. ఉన్నతి ఫౌండేషన్ ప్రతినిధులు బి.రంజిత్‌కుమార్, ఎస్.ఈశ్వరరావు మాట్లాడుతూ.. ఆంగ్ల భాషపై పట్టు, భావవ్యక్తీకరణ నైపుణ్యాలను సాధించాలన్నారు. కార్యక్రమంలో వర్సిటీ ప్రిన్సిపాల్ ఎం.అనూరాధ, ఏపీఎస్ఎస్‌డీసీ ప్రతినిధి శ్రీవాణి, కె.విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు. ● మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతిని సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు నివాళులర్పించారు. వర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనూరాధ, లా కోర్సు కోఆర్డినేటర్ వై.రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహంలో డీఈవో రాత్రి బస



విద్యార్థులతో కలిసి నిద్రిస్తున్న డీఈవో తిరుమల చైతన్య

జి.సిగడాం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యతో పాటు ప్రతిభావంతులుగా తీర్చిదిద్దే బాధ్యత తీసుకోవాలని డీఈవో తిరుమల చైతన్య ఉపాధ్యాయులకు సూచించారు. స్థానిక బీసీ బాలుర వసతి గృహంలో బుధవారం రాత్రి బస చేశారు. తొలుత స్థానిక కేజీబీవీ విద్యాలయాన్ని సందర్శించి విద్యార్థినుల చదువుపై ఆరా తీశారు. విద్యార్థులకు పెడుతున్న ఆహారాన్ని పరిశీలించి వారితో కలిసి భోజనం చేశారు. అనంతరం బీసీ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు పాఠాలు బోధించి, వారితో కలిసి నిద్రించారు. గురువారం ఉదయం కాలకృత్యాలు తీర్చుకుని విద్యార్థులతో కలిసి టిఫిన్ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహంలో నెలకొన్న సమస్యలను వార్డెన్ లోలుగు నూకరాజు డీఈవోకు వివరించారు. అనంతరం స్థానిక ఆదర్శ పాఠశాలను, వసతి గృహాన్ని సందర్శించారు. ప్రిన్సిపాల్ అన్నా శామ్యూల్ లెంక, వసతిగృ సంక్షేమాధికారి లోలుగు నూకరాజు, ఎంఈవోలు అరసాడ రవి, ముల్లు శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

విద్యుత్ పరికరాల సమస్య పరిష్కరించాలి

సోంపేట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): గొల్లగండి, రామయ్యపట్నం గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ పరికరాల సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యే బెందాళం అశోక్‌ను మత్స్యకార సహకార సంఘ అధ్యక్షుడు జి.చిన్నారావు కోరారు. గురువారం వినతి పత్రం అందించారు.

శిక్షణ పేరుతో ఉపాధ్యాయులను వేధించడం తగదు



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

గుజరాతీపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): శిక్షణ కార్యక్రమా లు పేరుతో ఉ పాధ్యాయులను వేధించడం తగదని ఏపీటీఎఫ్ నాయ కులు శ్రీకాకుళం ఎఫ్ఎల్ఎన్ శిక్షణ కేంద్రం వద్ద గురువారం నిరస న ప్రదర్శన నిర్వహించారు. మన్యం జిల్లాలో శ్రీనివాస్ అనే ఉపా ధ్యాయుడి మరణంపై ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. జిల్లా శాఖ ఉపాధ్యక్షుడు పేడాడ అ ప్పలనాయుడు మాట్లాడుతూ.. ఇటీవ ల రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతు న్న ఎఫ్ఎల్ఎన్ శిక్షణలో ఉపాధ్యాయు ల వరుసగా అనారోగ్యానికి గురై గుండెపోటుతో మరణించారన్నారు. ఎన్నిసార్లు ప్రభుత్వానికి విన్నవించినా శిక్షణ రెసిడెన్షియల్ పద్ధతిలో నిర్వహించడం మాన డంలేదన్నారు. అనంతరం శిక్షణ కేంద్రంలో డీఈవో ఎస్.తిరుమల చైతన్యను, రాష్ట్ర పరిశీలకులు కల్పనలను కలిసి 50 ఏళ్లు పైబడిన వారికి శిక్షణ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. కార్యక్రమం లో ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి చావలి శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిలర్లు బి.చంద్రశేఖర్, పి.శ్రీరామ్మూర్తి, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ టి.సూర్యనారాయణ, సీహెచ్ త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

మత్స్య ఉత్పత్తిదారుల సమాఖ్య ఏర్పాటు చేయండి

ఇచ్ఛాపురం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మత్స్య సహకార సం ఘాలను రైతు ఉత్పత్తిదారుల సమాఖ్యగా ఏర్పాటు చేయాలని మండల మత్స్యశాఖ అధికారి కె.రవికుమార్, రాష్ట్ర పరిశీలకులు చిట్టి నాయుడు అన్నారు. గురువారం కండ్రవీధిలో సొసైటీ అధ్యక్షుడు ఎ.కృష్ణచంద్ర బెహరా అధ్యక్షతన ఇచ్ఛాపురం స్వదేశీ మత్స్య పారి శ్రామిక సహకార సంఘంతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మత్స్యకశాఖ సహాయులకు అబ్దుల్ ముబీన్, సాగర మిత్ర పీవీ రమణ, బాలాజీ, రాజేంద్ర బెహరా పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే బాల్య వివాహాల నిర్మూలన



మాట్లాడుతున్న న్యాయాధికారి సన్యాసినాయుడు

గుజరాతీపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నిర్మూల నకు అందరి సహకారం అవసరమని జిల్లా న్యాయసేవాధి కార సంస్థ కార్యదర్శి, న్యాయాధికారి ఆర్.సన్యాసి నాయుడు అన్నారు. గురువారం జిల్లా కోర్టు ఆవరణలో బాల్య వివాహాల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా అవగాహన సదస్సును నిర్వహించారు. జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖాధికారి శాంత్రిశ్రీ, బాలల హక్కుల పరిరక్ష ణా వేదిక అధ్యక్షురాలు, శ్రీలక్ష్మి, జి.ఇందిరా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై డీఎల్‌పీవో విచారణ

పొందూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పెనుబర్తి పంచాయతీ ఖాతాలో నిధుల దుర్వినియోగం, అభివృద్ధి పనుల్లో జరిగిన అవకతవకలపై టీడీపీకి చెందిన పంచాయతీ వార్డు మెంబర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. శ్రీకాకుళం డీఎల్‌పీవో ఐ.వెంకటరమణ గురువారం ఆ గ్రామంలో విచారణ చేపట్టారు. ఈ నెల 23న పంచాయతీ సమావేశంలో నిధుల దుర్వినియోగం వార్డుసభ్యుల దృష్టికి రావడంతో వార్డుసభ్యులు కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణకు కలెక్టర్ ఆదేశించారు. ఈ మేరకు డీఎల్‌పీవో, ఈవోపీఆర్డీ పి.సింహాచలం ఫిర్యాదుదారుల సమక్షంలో విచారణ చేపట్టారు. కార్యదర్శికి సమాచారం లేకుండా గతేడాది సెప్టెంబరు 29న సర్పంచ్ టి.ఝాన్సీ పంచాయతీ ఖాతా నుంచి చెక్కు ద్వారా రూ.లక్ష డ్రా చేశారు. దీనిపై అప్పటి కార్యదర్శి శ్రీనివాసరావును ఫోన్‌లో డీఎల్‌పీవో ప్రశ్నించారు. రెండో ఫిర్యాదు మేరకు అల్మాజీపేటలో రోడ్డు పనులు చేసిన బాడాన శేషగిరినాయడుకు బదులుగా తమ్మినేని మురళికి బిల్లు చెల్లించడంపై విచారణ చేపట్టి గతంలో ఎంపీడీవో కార్యాలయం ఏవో మురళీకృష్ణను ఫోన్‌లో ప్రశ్నించగా.. వెండర్ కోడ్ అప్‌లోడ్ చేసింది గత ఎంపీడీవో హరిహరరావు అని తెలిపారు. అల్మాజీపేటలో జరగని పనులకు, పారిశుధ్య పనులకు తమకు తెలియకుండా ఫోర్జరీ సంతకాలతో రూ.3.60 లక్షలు డ్రాచేసేందుకు ప్రయత్నించినట్టు మూడో ఫిర్యాదు చేశారు. దీనినాటి కార్యదర్శి కేశవరావుకు ఫోన్‌లో ప్రశ్నించగా.. అగ్రిమెంట్ ఇచ్చే అధికారం తనకు లేదని తన సంతకం ఫోర్జరీ చేశారని చెప్పారు. ఈ ఫిర్యాదులపై ఉన్నతాధికారులకు నివేదిస్తానన్నారు. కార్యదర్శి జనార్దనరావు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి వద్ద షెడ్డుల్లో నిరుపయోగంగా ఉన్న అంబులెన్స్‌లు



డీఎంహెచ్‌వో కార్యాలయం ఆవరణలో తుప్పుపడుతున్న వాహనాలు

నిర్వహణ లేక.. వినియోగానికి నోచుకోక

● లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా

● ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో నిరుపయోగంగా వాహనాలు

శ్రీకాకుళంలోనిపలు ప్రభుత్వకార్యాలయాల అవసరాలకోసం లక్షలాది రూపాయల ప్రజాధనం వెచ్చించి కొనుగోలుచేసిన వాహనాలు నిర్వహణ లేక వినియోగానికి నోచుకోవడంలేదు.ప్రజలు చెల్లించే పన్నులతో కొనుగోలుచేసిన వాహనాల నిర్వహణలో అధికారుల నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారన్న విమర్శలొస్తున్నాయి. చిన్నపాటి సమస్య తలెత్తినా మరమ్మతులు చేయకుండా కార్యాలయాల ఆవరణలో మూలకు చేర్చేస్తున్నారు. తక్కువవ్యయంతో అందుబాటులోకివచ్చే అవకాశమున్నా కొత్త వాహనం కొనుగోలుకే పలుశాఖల సిబ్బంది ప్రాధాన్యం ఇస్తున్నారు. - (అరసవల్లి)



డీఆర్‌డీఏ కార్యాలయం వద్ద..



కలెక్టర్ కార్యాలయం వద్ద నిరుపయోగంగా..

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

జిల్లాలో వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందారు. కంచిలికి చెందిన ఓ యువకుడు జాడుపూడి కాలనీ వద్ద, ఆమదాలవలస పట్టణ పరిధిలోగల తిమ్మాపురం సమీపంలో మన్యం జిల్లా వీరఘట్టం మండలం జె.గోపాలపురానికి చెందిన యువకుడు దుర్మరణం పాలయ్యారు.

వారం రోజుల్లో విదేశాలకు వెళ్లాల్సి ఉండగా..



మణి(ఫైల్)

కంచిలి, నవంబరు28(ఆంధ్రజ్యోతి):వారంరోజుల్లో ఉద్యోగ రీత్యా విదేశాలకు వెళ్లాల్సి ఉండగా రోడ్డుప్రమాదానికి గురై మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసు కుంది. జాడుపూడి కాలనీ వద్ద జాతీయరహదారిపై బుధవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కంచిలి గ్రామానికి చెందిన చింతపల్లి లింగరాజు అలియాస్ మణి (23) మృతిచెందాడు. కంచిలి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మణి తన స్నేహితుడు ఎన్.రుషికేష్‌తో కలిసి బుధవారం రాత్రి 9 గంటల సమయంలో తన ద్విచక్రవాహనంపై సినిమా చూసేందుకు ఇచ్ఛాపురం వెళ్లాడు. సినిమా చూసిన అనంతరం తిరిగి వస్తూ మార్గమధ్యలో ఓ దాబాలో భోజనం చేశారు. అక్కడి నుంచి బయలుదేరి స్వగ్రామానికి వస్తుండగా.. సుమారు అర్ధరాత్రి 2.30 గంటల సమయంలో జాడపూడి కాలనీకి వచ్చే సరికి ద్విచక్ర వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో మణి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ వెనుకన కూర్చొన్న రుషికేష్ గాయపడ్డాడు. రుషికేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ పేరినాయుడు తెలిపారు. మణి తండ్రి త్రినాథ్ కంచిలి బీసీ హాస్టల్‌ఓ కుక్‌గా పని చేస్తుండగా.. తల్లి సుజాత గృహిణి. మణి ఉపాధి కోసం విదేశాలకు వెళ్లి వస్తుండేవాడు. వలస కూలీగా పనిచేస్తున్న మణి వచ్చే నెల 7వ తేదీన మలేషియా వెళ్లాల్సి ఉండగా, ఇలా రోడ్డు ప్రమాదంలో మృత్యువాతపడడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

బస్సు ఢీకొని యువకుడు..

ఆమదాలవలస, నవంబరు28(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని తిమ్మాపురం సమీపంలో గల జంక్షన్‌లో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా, మరో వ్యక్తిగాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. మన్యం జిల్లా వీరఘట్టం మండలం జె.గోపాలపురం గ్రామానికి చెందిన ఊయక చంద్రశేఖర్(30) అదే గ్రామానికి చెందిన కూర్మినాయుడుతో బైక్‌పై శ్రీకాకుళం వస్తుండగా.. తిమ్మాపురం సమీపంలోని జంక్షన్‌కు వచ్చేసరికి పాలకొండ వైపు వెళ్తున్న ఆర్టీసీ అద్దె బస్సు ఢీకొంది. ఈ ఘటనలో చంద్రశేఖర్ అక్కడికక్కడే మృతి చెందగా, బైక్ డ్రైవ్ చేస్తున్న కూర్మినాయుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఇతడిని చికిత్స నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. సమచారం అందుకున్న ఎస్ఐ వెంకటేష్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

పాతపట్నంలో యువకుడి ఆత్మహత్య



శ్రీనివాసరావు (ఫైల్)

పాతపట్నం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పాతపట్నంలోని యశోదానగర్‌కు చెందిన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, కుటుంబసభ్యుల కథనంమేరకు.. మెళియాపుట్టి మండలంలోని వసుంధరకు చెందిన ఆళ్ల శ్రీనివాసరావు(38) భార్యాపిల్లలతో పాతపట్నం యశోదానగర్‌లో నివాసముంటున్నాడు. ఇక్కడ ఫర్నీచర్ షాపు, రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. ఆయా వ్యాపారాల్లో నష్టాలొచ్చాయి. దీంతో అప్పులుపెరగడంతో ఆరునెలలుగా మనస్థాపంతో ఉంటున్నాడు. ఈనేపథ్యంలోబుధవారంసాయంత్రం నుంచి కుటుంబ సభ్యులు ఫోన్‌చేస్తున్నా స్విచ్‌ఆఫ్ అని వస్తోంది. మెసేజ్‌కుకూడా స్పందించడంలేదు. దీంతో అంతరాబరోడ్‌లోని స్టుడెంట్స్ కాలనీలోగల స్నేహితుల ఇంటికి గురువారం మధ్యాహ్నం భార్య స్వాతి చూసేందుకు వచ్చింది అయితే ఆ ఇంటికి తాళంవేసి ఉండడంతోపాటు ఇంటిముందు శ్రీనివాసరావు చెప్పులు ఉండడంతో స్నేహితులు వచ్చేవరకూ వేచిఉంది. ఇంతలో వారి పిల్లలు వచ్చి గెడతీసి లోపల చూసేసరికి శ్రీనివాసరావు ఆ ఇంట్లో ఉరివేసుకున్నాడు. దీంతో సమాచారం పోలీసులకు తెలియడంతో సీఐ ఎ.రామారావు, ఎస్ఐ బి.లావణ్య ఘటనాస్థలానికి చేరుకొని దర్యాప్తుచేశారు. అప్పులబాధను తాళలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు శ్రీనివాసరావు భార్య స్వాతి ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసునమోదుచేసినట్లు ఎస్ఐ లావణ్య తెలిపారు. శ్రీనివాసరావుకు కుమారుడు కార్తీక్, కుమార్తె మౌనిక ఉన్నారు.

లైన్‌మన్ ఇంట్లో చోరీ

పలాసనవంబరు 28(ఆంధ్రజ్యోతి):పలాసలోని పాత జాతీయరహదారి అయ్యప్ప ఆలయం వీధిలో లైన్‌మన్ ఇంట్లో చోరీ జరిగింది. సంఘటన స్థలాన్ని కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకటఅప్పారావు, సీఐ డి.మోహనరావు, క్లూస్‌టీమ్ సభ్యులు పరిశీలించారు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. పలాస విద్యుత్ కార్యాలయంలో లైన్‌మన్‌గా పనిచేస్తున్న తుంగాన ప్రభాకర్ అయ్యప్పస్వామి ఆలయం వద్ద నివాసముంటున్నారు. వీరి కుటుంబం నాలుగురోజుల కిందట షిర్డీయాత్రకు వెళ్లారు. తాళాలు సమీప బంధువుల ఇంటికి ఇచ్చివెళ్లారు. ఈక్రమంలో గురువారం మధ్యాహ్నం ఇంటి పెరుడు తాళం విరగ్గొట్టిన విషయాన్ని స్థానికులు గుర్తించి యజమానికి చెప్పారు. ఆయన తన బంధువులకు చెప్పి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో డీఎస్పీ ఆధ్వర్యంలో పోలీసులు పరిశీలించారు.బీరువాలో ఉన్న పదితులాల బంగారు ఆభరణాలు, వెండి సామగ్రితో పాటు రూ.1.50 లక్షల నగదు చోరీకి గురయ్యాయని ప్రభాకర్ విలేకరులకు ఫోన్‌లో తెలిపారు. ఆయన క్యాంపు నుంచి వస్తేగాని ఇంకా ఎంతమేరకు సామగ్రి చోరీకి గురయ్యిందో తెలియదని పోలీసులు చెబుతున్నారు. క్లూస్‌టీమ్ సభ్యులు ఇంటిలో వేలిముద్రలు సేకరించారు. శివారు ప్రాంతంలో ఉండే గృహాల యజమానులుక్యాంపులు వెళ్లే సమయంలో తమకు సమాచారం ఇస్తే పోలీసు గస్తీ ఏర్పాటు చేస్తామని డీఎస్పీ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోఫైనాన్స్ షోరూంలో..

పాతజాతీయరహదారిలో గల కాశీబుగ్గ సాయిలలిత ఆటో ఫైనాన్స్ షాపులో బుధవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. షాపులో సీసీ కెమెరాలు విరగ్గొట్టి దొంగలు షోరూంలోకి ప్రవేశించారు. గురువారం ఉదయం యజమాని మహేష్, సిబ్బంది షాపు తెరిచేందుకు ప్రయత్నించగా చోరీ జరిగినట్లు గుర్తించారు. హార్డ్‌డిస్క్, బీరువా విరగ్గొట్టి అందులో విలువైన ఫైల్స్ దొంగిలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు డీఎస్పీ వీవీ అప్పారావు, సీఐ డి.మోహనరావు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రైస్‌మిల్లులో కంప్యూటర్..

ఎల్.ఎన్.పేట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని రావిచెంద్రి జంక్షన్ సమీపంలో అలికాం-బత్తిలి ప్రధాన రోడ్డుకు ఆనుకుని ఉన్న ధనుకువాడ వెళ్లే రోడ్డులోని కల్కి కామేశ్వరి రైస్‌మిల్లులో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కంప్యూటర్‌తోపాటు దాని పరికరాలను దొంగిలించారని మిల్లు యజమాని వి.సురేష్ సరుబుజ్జిలి పోలీసులకు గురువారం ఫిర్యాదుచేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సరుబుజ్జిలి ఎస్ఐ ఎస్. బాలరాజు తెలిపారు.

సారా విక్రయదారులపై బైండోవర్ కేసులు

హరిపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి):మందస మండలంలోని పలుగ్రామాల్లో సారా విక్రయించడంతోపాటు రవాణాచేస్తున్న పాతనేరస్థులు, అనుమానితులుగా ఉన్న15 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ జేబీ తెలిపారు. ఈమేరకు గురువారం మందస తహసీల్దార్ హైమావతి వద్ద బైండోవర్ చేశారు.

సారాతో వ్యక్తి అరెస్టు

సోంపేట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సారా ప్యాకెట్లు తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు సీఐ కె.బాబీ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశం మేరకు నిర్వహించిన దాడుల్లో పట్టుబడినట్టు తెలిపారు.

గిరిజన ప్రాంత అభివృద్ధే లక్ష్యం: కూన



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఉన్న గిరిజన ప్రాంతమంతా అన్ని విభాగాల్లో సమగ్ర అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే కూన రవికుమార్ తెలిపారు. గురువారం బూర్జ మండలం వైకుంఠపురం గ్రామ పంచాయతీ అడుమల్లిగూడ గిరిజన గ్రామంలో ఉన్న చెరువుల్లో ఆయన చేపపిల్లలను విడిచిపెట్టారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణంనాయుడు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నందివాడ గోవిందరావు, తహసీల్దార్ పద్మావతి, మత్స్యశాఖ ఏడీ సంతోష్, పార్టీ మండల అధ్యక్షుడు వి.రాంజీ పాల్గొన్నారు. అలాగే ఆమదాలవలస మండలం జొన్నవలస గ్రామంలో ఎమ్మెల్యే ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.

పూర్తిస్థాయి మౌలిక వసతులు కల్పిస్తాం: గొండు శంకర్



పెద్దపాడులో పర్యటిస్తున్న గొండు శంకర్

అరసవల్లి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పెద్దపాడులో పూర్తిస్థాయి మౌలిక వసతులు కల్పించి అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. గురువారం పెద్దపాడులో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్ అధికారి సుధీర్‌కుమార్ పాల్గొన్నారు. ● అలాగే సింగుపురంలో గురువారం ఎమ్మెల్యే గొండు శంకర్ రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు.

● గార, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శ్రీకూర్మంలోని మండల సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.

అర్హులందరికీ పక్కా గృహాలు: ఎంజీఆర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

పాతపట్నం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ పక్కా గృహాలు మంజూరుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. గురువారం పాతపట్నంలోని క్యాంపు కార్యాలయంలో ఏపీ గృహనిర్మాణసంస్థ సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గృహనిర్మాణానికి రూ.2.50 లక్షలు మంజూరుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టెక్కలి హౌసింగ్ ఈఈ వెంపడాపు నరసింగరావు, ఏఈలు సీతారాం, మాధవరావు, మోహనరావు రమేశ్, కె.గణేష్ పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలి

కమ్యూనిటీ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని శ్రీచాత్తాదశ్రీవైష్ణవ సంఘం పాతపట్నంశాఖ అధ్యక్షుడు వి.మురళి,నాయకులు డి.నారాయణస్వామి, బి.వామనమురళికోరారు ఎమ్మెల్యే మామిడి గోవిందరావుకు వినతిపత్రం అందజేశారు.

సబ్‌స్టేషన్‌కు స్థలం మంజూరు చేయాలి

హిరమండలం, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): మండలంలో విద్యుత్ సబ్‌స్టేషన్‌కు స్థలం మంజూరు చేయలని, హిరమండలం పంచాయతీలో నిరుపయోగంగా ఉన్న మార్కెట్ యార్డు, శిథిలావస్థకు చేరిన పాత బస్టాండ్ భవనం స్థానంలో కొత్త దుకాణ సముదాయం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, వంశధార నిర్వాసితుల పునరావాస స్థలాల సమస్యలు పరిష్కరించాలని జడ్పీటీసీ సభ్యుడు పి.బుచ్చిబాబు కోరారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్ స్వప్నికల్ దినకర్ పుండ్కర్‌కు వినతిపత్రం అందజేశారు

మాదకద్రవ్యాలు విక్రయిస్తే చర్యలు: ఎస్ఐ

హిరమండలం, నవంబరు28(ఆంధ్రజ్యోతి) : మాదక ద్రవ్యాలు వాడినా, విక్రయించినా, రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ఎండీ ఆసిన్ తెలిపారు. యువత మాదక ద్రవ్యాలు సేవించి బంగారు భవిష్యత్ కోల్పోవద్దని కోరారు. గురువారం సుభలయ, ఆర్‌ఆర్ కాలనీలో సంకల్పం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా మత్తు పదార్థాలు వినియోగిస్తే కలిగే అనర్థాలను వివరించారు.

రెసిడెన్షియల్ ట్రైనింగ్‌ను రద్దుచేయాలి

నంగాం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రెసిడెన్షియల్ ట్రైనింగ్ రద్దుచేయాలని ఉపాధ్యాయ జేఏసీ డిమాండ్‌చేసింది. గురువారంనందిగాం ఎంఆర్సీ ఎదుట నిరసన తెలిపారు. గజపతినగరంలో లీడర్‌షిప్‌పై రెసిడెన్షియల్ శిక్షణలో భామిని మండలంలోని నేరడి ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరావు గుండె పోటుతో మృతిచెందారు.దీంతో జేఏసీ పిలుపుమేరకు ఎంఆర్సీ ఎదుట నిరసన తెలిపారు.

పర్లాం ఇసుక ర్యాంపు పరిశీలన

జలుమూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వంశధారనది నుంచి ట్రాక్టర్లతో ఇసుక తరలించే సమయంలో నిబంధనలు పాటించాలని తహసీల్దారు జె.రామారావు తెలిపారు. గురువారం మండలంలోని పర్లాం ఇసుక ర్యాంపును పరిశీలించారు. ఆయన వెంట ఆర్ఐ కిరణ్, వీఆర్వో ఎస్.రామారావు ఉన్నారు.

పెట్రో కెమికల్స్ పరిశ్రమ ఏర్పాటుకు స్థల పరిశీలన

సంతబొమ్మాళి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి):మండలంలోని మూలపేట పోర్టు సమీపంలో, అర్ధాంతరంగా నిలిచిపోయినఈస్టుకోస్టు పవర్‌ప్లాంట్, మేఘవరం తంపర భూములను హల్దియా పెట్రోలియంకార్పొరేషన్ ఆధ్వర్యంలో పెట్రోకెమికల్స్ పరిశ్రమ ఏర్పాటుకు అధికారులు గురువారం పరిశీలిచారు.రెవెన్యూఅధికారులు భూముల వివరాలను సంస్థ ప్రతినిధులకు వివరించారు. కార్య క్రమంలో టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, తహసీల్దార్ రమేష్‌కుమార్, ఏపీఐఐసీ, మారిటైం బోర్డు అధికారులు పాల్గొన్నారు.

సివిల్స్ కోచింగ్‌కు ఎమ్మెలే ఆసరా



రమణమ్మను అభినందిస్తున్న కలెక్టర్

అరసవల్లి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాన్ని అడ్డుకుని ఎంతో కష్టపడి చదివి, ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ రంగంలో ఉపాధి పొందుతూ ఎంతో మందికి ఆదర్శంగా నిలిచిన ఎచ్చెర్ల మండలం కుంచాల కురమయ్యపేటకు చెందిన బచ్చు రమణమ్మ సివిల్స్ కోచింగ్‌కు ఆర్థిక సాయాన్ని అందించేందుకు ఎన్‌ఈఆర్ స్కూల్ వ్యవస్థాపకుడు, ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు ముందుకు వచ్చారు. ఈ విషయంపై తనను కలిసిన ఎమ్మెల్యేను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అభినందించారు.

● రణస్థలం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల నియోజకవర్గంలోని పలు అభివృద్ధి అంశాలను చర్చించేందుకు గురువారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను నియోజకవర్గ నాయకులతో ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు కలిసి కోరారు.

షాపింగ్‌మాల్‌లో అగ్నిప్రమాదం

కాశీబుగ్గ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి):కాశీబుగ్గలోని కేటీరోడ్‌లో గల జాస్మిన్ షాపింగ్‌మాల్‌లో గురువారం జరిగిన అగ్ని ప్రమాదంలో వస్త్రాలు దగ్ధమయ్యాయి. బాధితుల కథనం మేరకు.. విజయనగరానికి చెందిన ఉప్పు మయూర్ జాస్మిన్ షాపింగ్‌మాల్ పేరుతో విజయనగరం, శ్రీకాకుళం, మందస, పలాస బ్రాంచ్‌లు నిర్వహిస్తున్నారు. పలాసలోని కేటీరోడ్‌కు ఆనుకుని ఉన్న షాపింగ్‌మాల్‌ను రాజేష్ మేనేజర్‌గా వ్యవహరిస్తున్నారు. ఉదయం 7.30 నిమిషాల తర్వాత షాపులో నుంచి మంటలు, పొగలు రావడంతో సెక్యూరిటీ గార్డు మేనజర్‌కు ఫోన్ చేయగా ఆయన అగ్ని మాపక కేంద్రానికి సమాచారం అందించారు. అగ్నిమాపక అధికారి బి.సోమేశ్వరరావు సిబ్బందితో సంఘటనాస్థలానికి చేరుకొని మంటలను అదుపుచేసే ప్రయత్నం చేశారు. షట్టర్ లోపల నుంచి మంటలు, పొగ ఎక్కువగా రావడంతో షట్టర్ ఎత్తి సిబ్బంది అదుపులోకి తీసుకువచ్చారు. ఒకఫైర్ ఇంజన్ చాలకపోవడంతో మందస నుంచి మరో ఫైర్ ఇంజిన్ కూడా తెప్పించి మంటలను అదుపు చేశారు. ప్రమాద సమయంలో షాపులో రూ.3.50 కోట్ల సరుకు ఉందని, ఎంతవరకు సరుకు నష్టం జరిగిందో అంచనా వేయాల్సి ఉందని మేనజర్ రాజేష్ తెలిపారు.

నూర్పు మిషన్ జారిపడడంతో ఇద్దరికి గాయాలు

టెక్కలి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): టెక్కలిలో గల ఓ ఇంజనీరింగ్ వర్క్‌షాపు వద్ద గురువారం రాత్రి నూర్పు మిషన్ మరమ్మతు చేసేందుకు జాకీ దన్నుపెట్టగా అది జారిపడడంతో నూర్పుమిషన్ బోల్తాపడింది. దీంతో టెక్కలికి చెందిన డొంకాన శంకరరావు, లక్ష్మీపురానికి చెందిన కంచరాన రాములు గాయపడ్డారు. దీంతో స్థానికులు జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

ఎచ్చెర్ల, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): తమ్మినాయుడులో పేకాటాడుతున్న ఏడుగురు వ్యక్తులను గురువారం పోలీసులు అరెస్టు చేశారు. తమ్మినాయుడుపేటకు చెందిన ముగ్గురు, శ్రీకాకుళం నగరానికి చెందిన మరో నలుగురు వ్యక్తులు కలిసి గ్రామంలోని ఓ ఇంట్లో పేకాటాడుతుండగా పట్టుకుని, వీరి నుంచి రూ.11,400, రెండు సెల్‌ఫోన్లు, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ వి.సందీప్‌కుమార్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

రోగులకు పూర్తిస్థాయి వైద్యమందించాలి

పోలాకి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల నేపథ్యంలో రోగులకు పూర్తిస్థాయి వైద్యం అందించడంతోపాటు రక్తపరీక్షలు నిర్వహించాలని రాష్ట్రీయ బాల స్వాస్థ కార్యక్రమ జిల్లా ప్రోగ్రాం అధికారి వెంకటఅప్పలనాయుడు తెలిపారు. గురువారం పోలాకి ప్రభుత్వోన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. సీజనల్ వ్యాధులు ప్రబలుతుండడంతో సిబ్బంది అప్రమత్తం ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో హెచ్ఎం లక్ష్మి, ఎంఈవో లింగరాజు, వైద్యాధికారి శ్రీనాథ్, మలేరియావిభాగ విస్తరణాధికారి రవికుమార్ పాల్గొన్నారు.

జీడి వ్యాపారవేత్త శ్రీనివాసరావు మృతి



శ్రీనివాసరావు(ఫైల్)

పలాస, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జీడి వ్యాపారవేత్త, పారిశ్రామికవాడ జీడి వ్యాపారుల సంఘం కోశాధికారి శాసనపురి శ్రీనివాసరావు(56) బుధవారంరాత్రి గుండెపోటుతో మృతిచెందారు.ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయ్యప్ప మాలధారణ చేసిన శ్రీనివాసరావు రాత్రి 10గంటల వరకు సన్నిధానంలో జరిగిన భజనలోపాల్గొన్నారు. అనంతరం ఇంటికి వెళ్లి రాత్రి 11గంటల తర్వాత బాత్‌రూములో కుప్పకూలిపోయారు. గురువారం మధ్యాహ్నం ఆయన దహనక్రియలు నిర్వహించారు. పలాస జీడి వ్యాపారులు బంద్ పాటించి సంఘీభావం తెలిపారు. ఆయన మృతి పట్ల సంఘ అధ్యక్షుడు మల్లా రామేశ్వరరావు,కార్యదర్శి తూముల శ్రీనివాసరావు, కార్మిక సంఘ అధ్యక్షుడు అంబటి కృష్ణమూర్తి, టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి గాలి కృష్ణారావు, పీసీఎంఏ అధ్యక్షుడు మల్లా సురేష్‌కుమార్, కార్యదర్శి కేవీ శివకృష్ణ, కోశాధికారి పట్నాన రవికాంత్, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు టంకాల రవిశంకర్‌గుప్తా, కొత్తకోట తిరుమలరావు, మల్లా భాస్కరరావు, వీఎల్ఎన్ రాజు సంతాపం తెలిపారు.

కోటబొమ్మాళితో శతచండీసహిత రుద్రయాగం

కోటబొమ్మాళి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కోటబొమ్మాళిలోని కొత్తమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో ఐదురోజులుగా వేదపండితులు సుసరాపు గణపతి శర్మ, సద్గురు కృష్ణ యాజీ, అంపోలు రుద్ర కోటేశ్వరశర్మ ఆధ్వర్యంలో జరుగుతున్న శతచండీసహిత రుద్రయాగం గురువారంముగిసింది. ఈసందర్భంగా యాగాలు, కుంకుమపూజలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఈవో వాకచర్ల రాధాకృష్ణ ఏర్పాట్లుచేశారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు: ఆర్డీవో



మాట్లాడుతున్న ఆర్డీవో గ్రంథి వెంకటేష్

పలాసరూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు తప్పవని ఆర్డీవో గ్రంథివెంకటేష్ హెచ్చరించారు.గురువారం పలాస ఆర్డీవోకార్యాలయంలో వైద్యులు, స్కానింగ్‌సెంటర్ నిర్వాహకులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌వో శ్రీకాంత్ మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్లకు వచ్చే గర్భిణుల పేరు నమోదు చేసుకోవాలన్నారు. సమావేశంలో వైద్యులు మల్లేశ్వరరావు, భీమారావు, మంజుల, శృతి, ఏపీఎన్‌జీవో అధ్యక్షులు గోపాల్, సూర్యకళ పాల్గొన్నారు.

సహాయ కుక్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

పాతపట్నం నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పాతపట్నంలో సహాయకుక్ పోస్టుల భర్తీకి గురువారం ఎంపీడీవో పి.చంద్రకుమారి ఇంటర్వ్యూలు నిర్వహించారు. కేజీబీవీ, ఏపీఎంఎస్‌లో ఒక్కో పోస్టులకు 38 దరఖాస్తులు రాగా 32 మంది ఇంటర్వ్యూకు హాజరయ్యారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.కిరణ్‌కుమార్, ఎంఈవోలు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎంఎస్‌ఎంఈ సర్వే

పలాస,నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీలో శుక్రవారం నుంచి ఎంఎస్‌ఎంఈ సర్వే నిర్వహించనున్నట్లు కమిషనర్ ఎన్.రామారావు తెలిపారు. గురువారం పలాసలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ చిన్న పాన్‌షాపు నుంచి భారీ పరిశ్రమలు, వ్యాపారాలు చేస్తున్న ప్రతి సంస్థలో సర్వే నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు టీడీపీ కార్యకర్తల సమావేశం

వజ్రపుకొత్తూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వజ్రపుకొత్తూరులో పార్టీ కార్యాలయంలో శుక్రవారం టీడీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ మండలాధ్యక్షుడు సూరాడ మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

నేడు పీజీలో ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్లు

నరసన్నపేట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి):స్థానిక ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో పీజీలో ప్రవేశానికి శుక్రవారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ కె.లత తెలిపారు. ఎంఎస్సీ కంప్యూటర్‌సైన్స్, ఆర్గానిక్ కెమిస్ట్రీలోపీజీ సెట్ అర్హత సాధించకపోయినా ప్రవేశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

బ్యూటీథెరపిస్ట్ కోర్సునకు దరఖాస్తుల ఆహ్వానం

పలాస,నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పలాస ప్రభుత్వ ఐటీఐలో అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్ట్ కోర్సులో ప్రవేశానికి మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ పైల జవహర్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే ఈకోర్సులోచేరేందుకు పదో తరగతి, ఆపైన చదివి ఉండాలని,18 నుంచి 35 ఏళ్ల వయసులో ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు వివరాలకు ఫోన్ నెంబరు: 6301046329కు సంప్రదించాలని తెలిపారు.

రాష్ట్రంలో నియంత పాలన

టెక్కలి,నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నియంత పాలన కొనసాగుతోందని వైసీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేడాడ తిలక్ ఆరోపించారు. గురువారం టెక్కలిలో మహాత్మా జ్యోతిరావుపూలే వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీలు ఆట్ల సరోజినమ్మ, శ్రీరామ్మూర్తి, జడ్పీటీసీ వెంకటాద్రి, కురమాన బాలకృష్ణ, అన్నెపు రామారావు, సత్తారు సత్యం, రమేష్, బమ్మిడి తులసి, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పలాసలో గ్రిగ్స్ పోటీలు

పలాస,నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పలాస ప్రభుత్వ ఉన్నతపాఠశాల మైదానంలో మండలస్థాయి క్వాలీ ఫైయింగ్ గ్రిగ్స్ పోటీలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖోఖోలో శ్రీచైతన్య, పలాస, చిన్నబడాం స్కూల్, కబడ్డీలో బొడ్డపాడు, బాలికల విభాగం ఖోఖోలో పలాస విద్యార్థులు ఎంపికయ్యారు. పోటీలను వ్యాయామఉపాధ్యాయులు పి.తవిటయ్య, బి.శంకరరావు, ఆర్.శ్రీనివాసరావు, పద్మలోచన, వైకే హరినాథ్, ఎస్.రామారావు ఆధ్వర్యంలో ఎంపికలు జరిగాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి.దాశరధి పాల్గొన్నారు.

పనులు పూర్తిచేయండి: పీడీ

పోలాకి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మెటీరియల్ కాంపోనెంట్ పనులను త్వరగా పూర్తిచేయాలని డ్వామా పీడీ వై.సుధాకరరావు ఆదేశించారు. మండలంలోని గొల్లలవలస, అంపలాంలో నిర్వహిస్తున్న పనులను పరిశీలించారు. అనంతరం అంపలాంలోని గోకులం నిర్మాణ పనులను తనిఖీచేశారు.



ఎల్.ఎన్.పేట: వాడవలసలో ధాన్యం బస్తాలపై టార్పాలిన్లు కప్పిన దృశ్యం



కోటబొమ్మాళి: హరిశ్చంద్రపురంలో కల్లానికి వరి కంకులను తరలిస్తున్న రైతులు



జలుమూరు: అంధవరంలో కల్లానికి వెళ్లి రైతులకు సూచనలు చేస్తున్న తహసీల్దార్ రామారావు

రైతుల్లో వాయుగుండం గుబులు

● పొలాల్లోనే కుప్పలు పెడుతున్న అన్నదాతలు

జిల్లాలోని అన్నదాతలు బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో గుబులు చెందుతున్నారు. ప్రస్తుతం కోస్తున్న వరి పంటను ఆదరాబాదరాగా కుప్పలు పెడుతున్నారు. మరికొందరు కల్లాలకు చేరుస్తున్నారు. కోసి నూర్చిన ధాన్యాన్ని బస్తాల్లో నింపి టార్పాలిన్లు కప్పుతున్నారు. వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు గ్రామాల్లోకి వెళ్లి కోతలు నిలిపివేయాలని సూచిస్తున్నారు. యంత్రాలతో నూర్పిడి చేసిన ధాన్యాన్ని స్థలాలు లేక రోడ్లు ప్రధాన వీధుల్లో ఆరబెట్టుకుంటున్నారు. - (ఆంధ్రజ్యోతి బృందం)



నందిగాం: పెద్దతామరాపల్లి సర్వీసు రహదారిలో ఆరబెట్టిన ధాన్యాన్ని బస్తాల్లో ఎత్తుతున్న మహిళలు



నరసన్నపేట: తామరాపల్లిలో పొలంలో కుప్పలు పెడుతున్న రైతులు